అకడమిక్ బలోపేతానికి చర్యలు: వీసీ

ఎచ్చెర్ల, జనవరి 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని అన్ని విభాగాలు అకడమిక్‌గా బలోపేతానికి చర్యలు చేపడతామని వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో శుక్రవారం బోధనా సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. రెగ్యులర్ బోధనా, బోధనేతర సిబ్బంది లేకపోవడంతో తాము అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నామని సిబ్బంది తెలిపారు. దీనిపై వీసీ స్పందిస్తూ.. ప్రతి విభాగం నుంచి వారాంతపు నివేదిక అందజేయాలన్నారు. కళాశాలల వారీగా సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు, సీడీసీ డీన్ సుజాత, డీన్ అనూరాధ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

నాలుగేళ్లుగా పరికరాల్లేవ్

- ప్రథమ చికిత్స కిట్ల పరిస్థితి అంతే
- ఉపాధి హామీ కూలీలపై అదనపు భారం

(ఇచ్ఛాపురం రూరల్)

ఉపాధి హామీ పథకంలో కూలీలకు నాలుగేళ్లుగా పరికరాలు ఇవ్వడం లేదు. దీంతో వారే సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఒక్కో కూలీపై రూ.350 నుంచి రూ.500 వరకు అదనపు భారం పడుతోంది. ఉపాధిహామీ పథకానికి కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. నిబంధనల ప్రకారం కూలీల వేతనాలకు 60శాతం, సామగ్రి విభాగం కింద 40శాతం నిధులు వెచ్చించాలి. పరిపాలనా ఖర్చుల కింద ఆరు శాతం మించకుండా చూసుకోవాలి. సామగ్రి విభాగం, పరిపాలనకు వెచ్చించే నిధులు కింద పరికరాలు కొనుగోలు చేసే వెసులుబాటు ఉంటుంది. అయితే నాలుగేళ్లకు పైగా గ్రామీణాభివృద్ధి శాఖ పరికరాల కొనుగోలుకు అనుమతి ఇవ్వకపోవడంతో సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో కూలీలకు పార, పలుగు, తట్టలు, నీడ కోసం టెంట్లు, ప్రాథమిక చికిత్సకు కిట్లు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కొన్ని గ్రూపులకు పరదాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పని చేసే ప్రదేశంలో ప్రమాదవశాత్తూ గాయపడితే ప్రథమ చికిత్సకు కనీస సామగ్రి కూడా అందుబాటులో లేదు.

మారుతున్న ప్రాధాన్యాలు..

జిల్లాలో 3.84 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 6.20 లక్షల మంది ఉపాధిహామీ కూలీలున్నారు. ప్రస్తుతం 1.40లక్షల మంది వేతనదారులు రెండు నెలలుగా పనులకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో కూలీల సంక్షేమం కోసం అనేక సౌకర్యాలు కల్పించేది. పథకం అమలులో రాష్ట్రప్రభుత్వాల ప్రాధాన్యతలు ఏటా మారడంతో కూలీలకు సౌకర్యాల కల్పనలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలో సామగ్రి విభాగం కింద సమకూరుతున్న నిధులను సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ భవనాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలకు వెచ్చిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో సామగ్రి భారం తమపై పడుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం సరఫరా చేసిన వెంటనే అందజేస్తాం

ఉపాధిహామీ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా పరికరాలు ఇవ్వకపోవడం వాస్తవమే. ప్రథమ చికిత్స కిట్లు కూడా ఇవ్వలేదు. పనుల వద్ద అవసరమైన మందుల కోసం డీఎంహెచ్‌వోతో సంప్రదించాం. ప్రతీ మండలంలో పీహెచ్‌సీల నుంచి అవసరమైన మందులు తీసుకువచ్చి ఉపాధి పనుల వద్ద ఉంచే ఏర్పాట్లు చేశాం. పరికరాలు ప్రభుత్వం ఇచ్చిన వెంటనే అందజేస్తాం.

-జి.వి.చిట్టిరాజు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

జీడిపప్పుపై నల్లమచ్చలు



నల్లని మచ్చలతో జీడిపప్పు

- నష్టపోతున్న వ్యాపారులు

(పలాస)

ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది జీడిపప్పుపై నల్లని మచ్చలు వ్యాపారులను కలవరపెడుతున్నాయి. సాధారణంగా ప్రతికూల పరిస్థితుల్లో జీడిపప్పుపై మచ్చలు వస్తుంటాయి. గుడ్డు రంగు మారడం, కుళ్లడం జరుగుతుంటాయి. కానీ ఈ ఏడాది ఎక్కువగా విదేశీ పిక్కలపై టన్నుకు 50 కిలోల వరకు ఇటువంటి మచ్చలు ఉండడంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మచ్చల కారణంగా రవాణాకు అనుకూలంగా లేకపోవడంతో జీడిపప్పును ముక్కలు చేసి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది రూ.20 కోట్ల వరకు వ్యాపారులు నష్టపోయినట్లు అంచనా. డిసెంబరు నుంచి మార్చి నెల వరకు జీడిపప్పు విక్రయాలు ఎక్కువగా ఉంటాయి. మనదేశంలో పిక్కల లభ్యత తక్కువగా ఉండడంతో వియాత్నం, ఐవిరికోస్ట్, శ్రీలంక, టాంజీనియా, ఘన వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. పిక్కలు పీలింగ్ చేసిన తరువాత ఎక్కువ శాతం పప్పుపై నల్లని మచ్చలు వస్తున్నాయి. పొగ మంచు, తెగుళ్ల జీడిపంటపై ప్రభావం చూపుతాయి. పిక్కలు కొనుగోలు చేసినప్పుడు నాణ్యత పరీక్షించాలి. ప్రతి వంద పిక్కలను సేకరించి పచ్చి పిక్కలనే పీలింగ్ చేయడం వల్ల నాణ్యత లభిస్తుంది. అయితే విదేశీ పిక్క లు నాణ్యత కొలుచుకోవడానికి ఇబ్బందులు ఉండడంతో బ్రోకర్లు, ట్రేడర్లు ఇచ్చిన రేటుకు, నాణ్యతతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల పప్పు తీసినప్పుడు ఇటువంటి సమస్యలు తరచూ వస్తున్నాయి. మన ప్రాంత పిక్కలకు ఇటువంటి సమస్యలు ఉన్నా కేవలం ఒకటి, రెండు శాతం వరకు మాత్రమే జీడిపప్పుకు మచ్చలు వస్తుంటాయి. పప్పు రకాల ఏరివేతలో ఇటువంటివి నివారించవచ్చు. కానీ టన్నుకు 50 కిలోల చొప్పున మచ్చలు వస్తుండడంతో వాటిని తొలగించడా నికి అంత సాంకేతిక నైపుణ్యం మన వద్ద లేకపోవ డంతో మొత్తం ఆ పప్పునంతా స్క్రాప్ కింద అట్టిపెట్టి ఉంచాల్సి వస్తుంది. ఉదాహరణకు సాధారణంగా జీడి పప్పు కిలో రూ.600 ఉన్నప్పుడు మచ్చలు ఉన్న పప్పు రూ.300కు మాత్రమే అమ్ముడవుతోంది. దీనివల్ల వ్యాపా రులు ఈ ఏడాది నష్టాలు చవిచూశారు. ప్రస్తుతం మార్కెట్‌లో జీడిపప్పు రేట్లు తగ్గుముఖం పట్టడం, మచ్చల పప్పు ఎక్కువ కావడం వంటి ఘటనలు వల్ల దెబ్బతిన్నారు. మరో ఆరు నెలలు ఇలాంటి జీడి పిక్కలు దిగుమతి అయితే తాము కుదేలయ్యే పరిస్థితి ఉందని ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

నాణ్యత పరీక్షిస్తే నష్టాలు ఉండవు..



నాణ్యత పరీక్షించిన తరువాతే పిక్కలు కొనుగోలు చేస్తే ఇటువంటి సమస్యలు ఉండవు. వ్యాపారులు ఏటా ఏదోఒక విధంగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ జీడి గింజలు కొనుగోలు, అమ్మకాలు జరిపితే వ్యాపారులకు ఇటువంటి ఇబ్బందులు ఉండవు.

-మల్లా భాస్కరరావు, జీడి వ్యాపార సంఘ మాజీ కోశాధికారి

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- 34 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- హాజరుకానున్న 8,430 మంది విద్యార్థులు
- గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతి



నరసన్నపేటలో నవోదయ పరీక్షకు ఏర్పాట్లు

నరసన్నపేట, జనవరి 19: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లాలో 8,430 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు 34 కేంద్రాల్లో వెన్నెలవలస జేవీకే పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 30 కేంద్రాలు, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, వీరఘట్టంలో రెండేసి కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరగనుండగా.. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఒరిజినల్ గుర్తింపు కార్డు(ఆధార్) ఉంటేనే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. గుర్తింపుకార్డుతోపాటు హాల్‌టిక్కెట్, ప్యాడ్, నీలం, నలుపు రంగు పెన్నులు విద్యార్థులు తీసుకెళ్లాలి.

సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్

జిల్లాలో సరుబుజ్జిలి మండలం వెన్నలవలసలో నవోదయ పాఠశాలను 1988లో కేంద్రప్రభుత్వం ప్రారంభించింది. ఇక్కడ ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితవిద్యను అందిస్తారు. కార్పొరేట్ పాఠశాలల వసతులతో, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు నిపుణులైన ఉపాధ్యాయులతో బోధిస్తారు. ఇంటర్‌లో ఎంబైపీసీ రెండింటినీ చదివే అవకాశం ఈ పాఠశాలలోనే ఉంది. ఆరో తరగతిలో చేరేందుకు 80 సీట్లు ఉన్నాయి. వాటిలో 75శాతం రూరల్ ప్రాంతం వారికి, 25 శాతం నగరవాసులకు కేటాయిస్తారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి

నవోదయలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి జిల్లాలో 34 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నాం. కేంద్రాల వద్ద వైద్యఆరోగ్య సిబ్బంది, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేశాం. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాం.

- డి.పరశురామయ్య, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ కేంద్రం, వెన్నెలవలస

మంచి రోజులు రానున్నాయ్

- చంద్రబాబు సీఎం కావడం ఖాయం: ఎంపీ రామ్మోహన్‌నాయుడు
- వైసీపీ నుంచి సర్పంచ్‌తో పాటు 60 కుటుంబాలు టీడీపీలో చేరిక

నరసన్నపేట/జలుమూరు(సారవకోట), జనవరి 19: 'రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయి. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు సీఎం కావడం ఖాయం. రాష్ట్రానికి పట్టిన శని పోయి.. మళ్లీ గ్రామాలు అభివృద్ధి బాట పడతాయి' అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాల్లో 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా.. కదలిరా..' కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా నరసన్నపేట మండలం పారశెల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'రానున్న ఎన్నికల్లో అధికారపార్టీ నాయకులు తప్పుడు మాటలు చెప్పినా వినకుండా టీడీపీని గెలిపించాలి. చంద్రన్న మళ్లీ సీఎం కావాలని ప్రతి కుటుంబ కోరుకుంటోంది. అందుకే అధికారపార్టీ నేతలు కుయుక్తులకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో దుర్మార్గుడి పాలన పోవాలంటే అందరూ కలిసికట్టు పోరాటానికి సిద్ధమవ్వాలి. టీడీపీ విజయానికి కృషి చేయాల'ని ఎంపీ రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిన వైసీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. గ్రామాల్లో చంద్రన్న మాట వినిపిస్తుందనే విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఎంపీ రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమక్షంలో పారశెల్లి సర్పంచ్ డబ్బీరు కిరణ్‌చంద్ర పట్నాయక్ తన కుటుంబ సభ్యులతో సహా గ్రామానికి చెందిన 60 కుటుంబాలతో టీడీపీలో చేరారు. పంచాయతీలో అభివృద్ధి చేయలేని నాయకుల వెంట ఉండలేమని సర్పంచ్ కిరణ్ సభలో వెల్లడించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, అడపా చంద్రశేఖర్, ధర్మాన తేజ్‌కుమార్, కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.



పారశెల్లిలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సర్పంచ్, గ్రామస్థులు



చెవిలో పూలు పెట్టుకుని యూటీఎఫ్ నాయకుల నిరసన

యూటీఎఫ్ పోరుబాట

- చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన

అరసవల్లి, జనవరి 19: యూటీఎఫ్ పోరుబాట పట్టింది. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన చేశారు. శుక్రవారం శ్రీకాకుళంలోని డేఅండ్ నైట్ కూడలి వద్ద ఉపాధ్యాయులు చెవిలో పూలు పెట్టుకుని, మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన తెలిపారు. బకాయిలను తక్షణమే చెల్లించాలని, 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చౌదరి రవీంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకపోగా.. కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరి మారాలని నినాదాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న 18వేల కోట్ల డీఏ, పీఆర్‌సీ, సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐ పీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. హామీలను అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు. పి.సూర్యప్రకాశరావు, కె.వెంకటరావు, సురేష్ కుమార్, టి.పాపారావు, పి.చిన్నారావు, రవి, సారథి, షణ్ముఖరావు, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

- ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

కలెక్టరేట్, జనవరి 19: రైతుల వద్ద ప్రతీ ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. రైతులు నష్టపోకుండా పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నామన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మంది రంలో వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర కల్పించడం మనందరి బాధ్యతన్నారు. కొనుగోళ్ల వేగవంతం చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. 'జిల్లాలో ఇప్పటివరకు 79,177 మంది రైతుల నుంచి 3.60 లక్షల టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేశాం. 70,174 మంది రైతులకు రూ.608.38కోట్లు చెల్లించాం. మిగిలిన రైతులకు 5 రోజుల్లో డబ్బులు చెల్లిస్తామ'ని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, గొండు రఘురామ్, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు, పశు సంవర్థక శాఖ జేడీ కిషోర్, వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, వ్యవసాయాధికారి శ్రీధర్, పౌరసరఫరాల మేనేజర్ శ్రీనివాసరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, ఎల్‌డీఎం సూర్య హరికిరణ్, ఏడీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రాస్తారోకో

- సమస్యల పరిష్కారంపై రాతపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్



శ్రీకాకుళంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అంగన్‌వాడీలు

ఇచ్ఛాపురం/అరసవల్లి, జనవరి 19: సమస్యల పరిష్కారం, హామీల అమలు కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మె కొనసాగిస్తూనే ఉన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. 38 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హైమా, సుబ్బలక్ష్మి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అలాగే శ్రీకాకుళంలో దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ముందుగా జ్యోతిబాపూలే పార్కు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై రాత పూర్వక హామీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, నాయకులు కె.పార్వతి, డి.జ్యోతి, నీలవేణి, ఈ.అప్పలనరసమ్మ, సూర్యకుమారి, లక్ష్మి, పద్మావతి, చిట్టితల్లి, డి.ముత్యాలమ్మ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయ దుందుభి

● ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు

జలుమూరు (సారవకోట), జనవరి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ రాష్ట్రంలో విజయదుందుభి మోగిస్తుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. 'రా.. కదలిరా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నవరడ్డపనస పార్టీ కార్యాలయం నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలంబ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజానీకం గుర్తించి రానున్న ఎన్నికల్లో సైకో పాలనకు చమరగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ పాలనతో విసిగి పోయిన ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారన్నారు. ద్విచక్ర వాహన ర్యాలీ అలుదు, కేశవలస, పదంపురం, జమచక్రం, మదనాపురం, వాండ్రాయి, గోవర్ధనపురం మీదుగా పెద్దలంబ వరకు కొనసాగింది. గోవర్ధనపురంలో వీధి లైట్లును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, జలుమూరు, సారవకోట, నరసన్నపేట మండలాల పార్టీల అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, శిమ్మ చంద్రశేఖర్, నాయకులు సురవరపు తిరుపతిరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు, తాడేల భీమారావు, డి.జయరాం, కోన వెంకటేష్, పిల్లా నందకిషోర్, బైరి భాస్కరరావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, తర్ర బలరాం, కింజరాపు సత్యం తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

టీడీపీ ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోండి

● డీఎస్పీని కోరిన ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస, జనవరి 19: టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను వైసీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా చించివేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన సంవత్సరం, సంక్రాంతి నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసీపీ మూకలు చించివేయడం దారుణమని, గ్రామాల్లో మా కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేలా వారి ఆగడాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేట, పెద్దబొడ్డపాడు, సీతాపురం, టి.గడూరు, పలాస మండలం కైజోల, లొద్దబద్ర, కిష్టుపురం, అల్లుకోల, మున్సిపాలిటీ పరిధి చిన్నబడాం, మందస మండలం బాలిగాం, చిన్నకోష్ట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించివేశారని ఆ ఫొటోలను విడుదల చేశారు. లొద్దబద్ర గ్రామంలో ఏకంగా ఫ్లెక్సీని దహనం చేశారని, దీనిపై ఈనెల 2, 13 తేదీల్లో కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికీ నిందితులపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, సప్ప నవీన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పలాస రూరల్ కైజోలలో ధ్వంసం చేసిన ఫ్లెక్సీలను ఆమె పరిశీలించారు.

దళితులను దగా చేసిన జగన్

పలాస: రాష్ట్రంలో దళితులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దగా చేశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల తో మాట్లాడుతూ కోడి కత్తి శ్రీనును జగన్ తన స్వార్థం కోసం బలిపశువు చేశారని ఆరోపించారు. జగన్ మాయమాటలకు మోసపోయిన ఓ దళిత యువకుడిని జైలు పాలుచేసి అందులోనే పూర్తిగా ఉంచేందుకు కుట్రపన్నారన్నారు. ముఖ్యమంత్రికి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని, ఆయన రచించిన రాజ్యాంగం వల్ల భారతీయులంతా సుభిక్షంగా ఉన్నారని, కానీ ఆ రాజ్యాంగాన్ని తలదన్నేలా రాష్ట్రంలో జగన్ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు.



డీఎస్పీ నాగేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న గౌతు శిరీష

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: కలమట

పాతపట్నం: టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. కొరసవాడలో పంచాయతీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇచ్చి వృత్తిదారులను ప్రోత్సహించిందన్నారు. అయితే ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం వారిని విస్మరించిందన్నారు. దళితులపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కోడి కత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, నాయకులు మద్దు రామారావు, మంచు కృష్ణారావు, కర్రి అప్పారావు, బోను శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

కొత్తూరు: కుద్దిగాం పంచాయతీ వీరనారాయణపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు శుక్రవారం మాతలలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టి.లక్ష్మీనారాయణ, శిర్ల రమేష్, గు ర్రాల సాయి, పందిర రమేష్, సోద తవుడు, టెంబరు ప్రసాద్, రామారావు, నవీన్, హరిశ్చంద్ర, ధర్మారావుతో పాటు మరో 20 కుటుంబాలున్నాయి. ఈ సందర్భంగా కలమట రమణ మాట్లాడుతూ.. వైసీపీ విధానాలు నచ్చక ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు. ఆ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కుద్దిగాం సర్పంచ్ నెల్లి అచ్యుతరావు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కలమట వెంకట రమణమూర్తి

అంబేడ్కర్‌కు ఘన నివాళి

నరసన్నపేట: పట్టణంలో సామాజిక సమరసత పేరిట శుక్రవారం సంఘీభావ ర్యాలీని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దళితుల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు జయరాజ్, ప్రవల్లిక ప్రియ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు. ● **పోలాకి:** డోల రోడ్డుకు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చైతన్య, ముద్దాడ భైరాగినాయుడు, సర్పంచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూడో దశ రీ సర్వేని సత్వరం పూర్తిచేయాలి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించి మూడో దశలో చేపడుతున్న రీ సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని టెక్కలి డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎం.జనార్దనరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఇంతవరకు రెండు దశల్లోనూ రైతుల భూములకు సంబంధించిన రీ సర్వే జరిగిందన్నారు. రెండు దశల్లో జరిగిన తప్పులను రైతులు రాతపూర్వకంగా తహసీల్దార్ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని సరిచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మండల రీసర్వే డీటీ జి.ప్రసాదరావు, మండల సర్వేయర్ ఆర్.గవరయ్య పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన చేపట్టాలి

నరసన్నపేట: కులగణన పారదర్శకంగా చేపట్టాలని పర్యవేక్షణాధికారి, ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు. శుక్రవారం ఉర్లాం, నడగాం గ్రామాల్లో కుల గణన సర్వేని ఆయన పరిశీలించారు. సత్యవరం గ్రామంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ బి.శంకర రావు కులగణన సర్వేని ప్రారంభించారు. ● **నందిగాం:** మండలంలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. అయితే యాప్ సరిగా పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. 22 సచివాలయాల్లో ఈ ప్రక్రియ చేపట్టారు. ఎంపీడీవో టి.రాజారావు సర్వేని పరిశీలించారు. కల్లాడ, దిమ్మిడిజోల తదితర సచివాలయాల పరిధిలో నెట్ సేవలు అందక యాప్ పనిచేయక సిబ్బంది నిరీక్షించాల్సి వచ్చింది. ● **తురకపేట (ఎల్ఎన్‌పేట):** కులగణన సర్వేలో కుటుంబంలోని అందరి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని ఎంపీఈవో ఆర్.కాశీప్రసాదరావు తెలిపారు. తురకపేటలో శుక్రవారం కులగణన సర్వేని పరిశీలించారు. సంబంధిత వ్యక్తుల కులంతో పాటు వారు ఏం చేస్తున్నారు, ఆర్థికంగా ఎలాంటి స్థితిలో ఉన్నారన్న వివరాలు సేకరిస్తారన్నారు. కులగణన సర్వేపై నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి జి.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి సాయం

నందిగాం: కల్లాడ గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితుడు దాసారపు రమణయ్య కుటుంబానికి కాపుతెంబూరు సరస్వతి సేవా సంఘం ప్రతినిధులు ఆర్థిక సాయం చేశారు. అగ్ని ప్రమాదంలో కలవ, సామగ్రి కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి రూ.15 వేలను మాజీ సర్పంచ్ నందిగాం తిరుపతిరావు, ఇతర పెద్దల చేతులు మీదుగా అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కొల్లి హరిబాబు, జి.హరికృష్ణ, పి.దాముసాయుడు, కె.మోహనరావు, మురళి, రామకృష్ణ, సతీష్ ఉన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

టెక్కలి: మహిళలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్‌జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారికి సముచిత స్థానం ఇవ్వాలన్నారు. లింగ వివక్ష చట్టరీత్యా నేరమన్నారు. ఆడ, మగ మధ్య ఎటువంటి వ్యత్యాసం చూపరాదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, తహసీల్దార్ కె.ప్రవల్లిక ప్రియ, ఏఎస్ఐ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి

పొగమంచుతో అవస్థలు

టెక్కలి: పొగమంచుతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి 12 గంటల కురుస్తున్న మంచు ఉదయం 8, 9 గంటలు దాటినా తగ్గడం లేదు. శుక్రవారం ఇటువంటి పరిస్థితే నెలకొంది. పొగమంచుతో రోడ్డు కనిపించడం లేదు. లైట్లు వేసుకుని వెళ్లినా రహదారులు కనిపించని పరిస్థితి నెల కొంది. జాతీయ రహదారిపై పొగమంచుతో వాహన రాకపోకలు తగ్గిపోయాయి. పొగమంచు ప్రభావం తీవ్రంగా ఉందని పలువురు వాహన చోదకులు అభిప్రాయపడ్డారు.



హైవేపై కమ్మేసిన పొగమంచు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యం

● డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు

వజ్రపుకొత్తూరు: కేంద్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్య మని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శుక్రవారం అక్కుపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో రాష్ట్రానికి ఒరిగిందేమీలేదన్నారు. కనీసం రైల్వే జోన్ పనులు కూడా ప్రారంభించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆస్తులు అదాని, అంబానీలకు అప్పగిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాలలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందన్నారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పలాస నియోజకవర్గంలో మత్స్యకారులకు తగిన న్యాయం జగగడంలేదని అందువల్లే ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందన్నారు. మత్స్య కారుల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. జిల్లా దళిత నాయకుడు తెంబూరి మధుసూదనరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై హింస పెరుగుపోయిందన్నారు. దళితులు, గిరిజనల గొంతు నొక్కేలా కేంద్ర, రాష్ట్రాల్లో పాలన సాగుతోందని విమర్శించారు. వైసీపీ సీనియర్ నాయకుడు కోడ దేశయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో పలాస నియోజవకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా మత్స్యకార నాయకులు తిర్రి శాంతారావు, రుద్రమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పరమేశ్వరరావు

తెలగ కులస్థులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలి

పలాసరూరల్: తెలగ కులస్థులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని పలాస-కాశీబుగ్గ రాజరాజేశ్వరి దేవి తెలగ కుల సంక్షేమ సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎల్.మధుసూదనరావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గంలో 8 వేలకు పైగా తెలగ కులస్థులున్నారని, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వీరిలో 80శాతం వరకు కూలీ పనుల కోసం వలస వెళ్తున్నారన్నారు. ప్రత్యేక రిజర్వేషన్ లేకపోవడం వల్ల ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, ఒడిశాలో తెలగ కులస్థులను బీసీలుగా గుర్తించారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో తెలగ కుల సంఘ నేతలు లోకు, భాస్కరరావు, ప్రతాపరాజు, గిరి, ప్రసాద్, కామేశ్, గోపి, మన్మథరావు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలగ కుల సంఘ నేతలు

దళిత ద్రోహి జగన్‌రెడ్డి

టెక్కలి: దళిత ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. శుక్ర వారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి అక్కడే నిరసన తెలిపారు. సీఎం జగన్ దళితుల జీవితాన్ని పణంగా పెట్టి రాజకీయ ప్రయోజనం పొందుతున్నారని విమర్శించారు. కోడి కత్తి దాడి కేసులో కోర్టుకు హాజరుకాకుండా దళిత బిడ్డ శ్రీను జీవితాన్ని నాశనం చేశారని ఆరోపించారు. స్వార్థ రాజకీయాల కోసం దళితులను వాడుకొని ఆ తరువాత వారిని పక్కన పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవల అప్పల స్వామి, నేతలు హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, లవకుమార్, మురళీ, ప్రీతీష్, ప్రసాద్ రెడ్డి, కోళ్ల కామేసు, మెండ దమయంతి, షణ్ముఖరావు, రాజశేఖర్, ఆదినారాయణ, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నందిగాం: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ ఆర్వో నూరుల్‌కమర్ శుక్రవారం పరిశీలించారు. కృష్ణరాయపురం, బంజీరుపేట, కోమటూరుల్లోని పాఠ శాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. భవనాల పరిస్థితిపై ఇంజనీరింగ్ అధికారి పి.సంతోష్ కుమార్‌ను అడిగి తెలుసు కున్నారు. కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సదుపాయాలు కల్పించాలని సూచించారు. తహసీల్దార్ వైవీ పద్మావతి, ఎన్నికల డీటీ అనిల్, బీఎల్వోలు మీనా, బి.ప్రసాదరావు తదితరులున్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పద్మనాభపురం అంబుసోలి గ్రామ పరిసర ప్రాంతాల్లోని శ్మశాన వాటిక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు కోరారు. శ్మశాన వాటికను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న వైనంపై స్థానికులు తన దృష్టికి తీసుకువెళ్లగా శుక్రవారం సదరు ప్రాంతాన్ని పరిశీలించానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తకోట జనార్దనరావు, పిల్లి ఊర్మిళ మధ్య స్థల వివాదం ఉందని, దీనిపై కోర్టులో వ్యాజ్యం నడుస్తోందన్నారు. అయితే కొందరు ఆక్రమణదారులు ఊర్మిళ వద్ద అగ్రి మెంట్ పొందినట్లు పత్రం చూపించి సదరు స్థలాన్ని ఆక్రమించారన్నారు. అంబుసోలి శ్మశానం రోడ్డు, బావి ఆక్రమించి మునిసిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులతో కలిసి సదరు స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులను ప్రశ్నించగా వారు గ్రామస్థుల పైకి దూసుకు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించి గ్రామస్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న రౌడీ షీటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పార్లమెంటరీ టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ జనరల్ సెక్రటరీగా సురేంద్ర



జలుమూరు: టీడీపీ పార్లమెంట్ ప్రొఫెషనల్ వింగ్ జనరల్ సెక్రటరీగా గొండు సురేంద్రనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సురేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యత లను తూచా తప్పకుండా నిర్వర్తిస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సైరిగాం పంచాయతీ లింగన్నాయుడుపేటకి చెందిన సురేంద్రనాథ్‌ను జనరల్ సెక్రటరీగా నియమించడంపైపార్టీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, కింజరాపు సత్యం, గుండ రామకృష్ణ, నక్క రమేష్ తదితరులు హర్షం ప్రకటించారు.

ఎంపీ నిధులతో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు

కేపీవలస(పోలాకి): కుసుమపోలవలస పంచాయతీలోని వీధి లైట్లు వేసేందుకు వీలుగా స్తంభాల ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయని సర్పంచ్ తర్ర లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ద్వారా ఎంపీ రామ్మోహన్ నాయుడును కోరామన్నారు. ఈ మేరకు రూ.10 లక్షలను ఆయన తన ఎంపీ నిధుల నుంచి కేటాయించారన్నారు. త్వరలో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలకు బి.రాంబాబు, బైరి భాస్కరరావు, జి.వెంకటరావు అభినందించారు.

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని ఆర్వో జయదేవి సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌలిక వసతులున్నాయా లేదా పరిశీలించాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, విద్యుత్ సౌకర్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్ వితరణ

మందస: కొత్తపల్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అశోక్‌కుమార్ పాణిగ్రాహి సౌండ్ బాక్స్, స్పీకర్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నవర గణేశ్వరరావు, ఉపాధ్యాయులు జి.సూర్యారావు, ఎస్.మురళి, కిరణ్ పాల్గొన్నారు.

హైవేపై కోతుల బెడద

మందస: కొత్తపల్లి గ్రామ సమీపంలో హైవేపై కోతుల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా వచ్చి ద్విచక్ర వాహన చోదకులు, బాట సారులపై దాడి చేస్తుండ దంతో వారంతా తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హామీలను నెరవేర్చాలి

● యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

అధికారంలోకి వచ్చేందుకు గాను సీఎం జగన్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘ నేతలు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, నూతన పీఆర్సీ విధి విధానాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



నరసన్నపేట: ఒంటి కాలిపై నిలుచుని, చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు



పొందూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు







ఆమదాలవలస, కాశీబుగ్గ, కోటబొమ్మాళి మండలాల్లో ర్యాలీ నిర్వహించి నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు




టెక్కలి: నిరసన ప్రదర్శన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



పాతపట్నంలో ర్యాలీ

కాలువలో జారిపడి వ్యక్తి మృతి


బుచ్చిబాబు (ఫైల్)

గార: లింగాలవలసలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పెద్దాడ బుచ్చిబాబు (52) అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చిబాబు మద్యం తాగి ఇంటికి వెళ్తుండగా రోడ్డు పక్కనే ఉన్న కాలువలో జారి పడిపోవడం వల్ల చనిపోయాడని అతని కుమారుడు తిరుమల ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ టి.చంద్ర మోహన్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు

నరసన్నపేట: తిలారు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడికి 30 నుంచి 35 సంవత్సరాలు వయసు ఉంటుందని పలాస రైల్వే ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు యాచకుడిగా స్థానికులు భావిస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బూర్జ: అయ్యవారిపేట గ్రామానికి చెందిన ఇప్పిలి శిమ్మన్నపై దాడి జరిగినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు చోడవరపు మురళి, సింహాచలం తమ పొలంలో సెల్ టవర్ నిర్మాణం కోసం అనుమతి కోరుతూ తహసీల్దార్‌కు విన్నవించారు. దీనికి పంచాయతీ తీర్మానం కావాలని చెప్పారు. దీంతో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఆ గ్రామ సర్పంచ్ అంబుజాక్షి భర్త ఇప్పిలి శిమ్మన్నను తీర్మానం ఇవ్వాలని కోరారు. ఆ భూమి కోర్టు వివాదంలో ఉన్నందున తీర్మానం ఇవ్వలేమని శిమ్మన్న తేల్చిచెప్పాడు. దీంతో వారిమధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం కార్యాలయం వెలుపల అన్నదమ్ములిద్దరూ కాపుకాచి.. శిమ్మన్న వచ్చిన వెంటనే హెల్మెట్, కర్రలతో దాడిచేశారు. గాయపడిన శిమ్మన్న వారి నుంచి తప్పించుకొని తన వాహనంపై పాలకొండ ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పట్టుబడిన పేకాటరాయుళ్లు

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధిలోని బొడ్డేపల్లిపేట మామిడి తోటలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఎస్ఐ వై.కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.11,510, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పిల్లల కేసులను సత్వరమే పరిష్కరించాలి

అరసవల్లి: చట్టం ద్వారా విభజించే పిల్లల కేసులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన జువైనల్ బోర్డును సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ కందికట్ల రాణి, జిల్లా ప్రొబేషన్ అధికారి రవికుమార్, జువైనల్ జస్టిస్ బోర్డు మెంబరు శ్రీదేవి, లీగల్ అధికారి లక్ష్మణరావు, పీపీ పి.సుశీల ఇతర న్యాయవాదులు, పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ సేవలు అందాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

అరసవల్లి: వన్‌స్టాప్ సెంటర్ సేవలు మహిళలకు అందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరికీ వన్‌స్టాప్ సెంటర్ సేవలు మరింత చేరువ కావాలని అన్నారు. సిబ్బంది సెంటర్‌కు వచ్చిన ప్రతీ మహిళను ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ న్యాయవాది మోహనరావు, ఏఎస్ఐ రేణుకా రాణి, వన్‌స్టాప్ సిబ్బంది హిమబిందు పాల్గొన్నారు.

కులగణనను అడ్డుకున్న లొద్దపుట్టి వాసులు


గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: కులగణన సర్వేను లొద్దపుట్టి గ్రామస్థులు అడ్డుకున్నారు. శుక్రవారం గ్రామంలో చేపట్టిన కులగణన సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించలేదు. గ్రామాభివృద్ధిని గత రెండేళ్లుగా అధికారులు పట్టించుకోలేదని, దీంతో గ్రామ అభివృద్ధి సంఘం ద్వారా రూ.3.50 లక్షలు ఖర్చు చేసి కోతుల నియంత్రణకు, కాలువల నిర్మాణం, పారిశుధ్య పనులకు వెచ్చించినట్టు తెలిపారు. ఆ మొత్తాన్ని పంచాయతీ నిధులు నుంచి ఇస్తేనే కులగణన చేయాలని గ్రామ పెద్దలు చాటింపు వేయించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, తహసీల్దార్ ఎస్.గురుప్రసాద్ గ్రామానికి చేరుకుని అక్కడి పెద్దలతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. వెంటనే సర్పంచ్, వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహించి పంచాయతీ నిధులు ఎంత మొత్తంలో అవకాశం ఉందో చర్చించి తీర్మానం చేయాలని కార్యదర్శి, సర్పంచులను ఆదేశించారు. నిధులపై గ్రామ పెద్దలకు భరోసా ఇచ్చారు. వారు సహకరించడంతో కులగణన నిర్వహణ చేపట్టారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె ఇద్దరు కుమార్తెలు అనాథులయ్యారు. వీరికి యువ భారత్ సేవా ఫౌండేషన్ (వైబీఎస్ఎఫ్) సంస్థ అండగా నిలిచింది. శుక్రవారం వారికి రూ.6 నెలలకు సరిపడ నిత్యావసర సరుకులతో పాటు రూ.10 వేలు అందజేశారు. సంస్థ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా దళితుల మారణకాండ

- జగన్‌రెడ్డి పాలనలో 188 మంది హత్య
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్


విలేకరుల మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస: వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత సైకో సీఎం జగన్‌రెడ్డి పాలనలో దళితులు మారణకాండ నేటికీ జరుగుతూనే ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆమదాలవలసలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి పాలనలో 188 మంది దళితులను అతి కిరాతకంగా హత్యలు చేస్తే నేడు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి దళితుల ఓట్లకు గాలం వేయాలని చూస్తున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు దళితులకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి ఉపాధి అవకాశాలను కల్పించారని గుర్తుచేశారు. హరిజన, గిరిజన ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ నిధులన్నీ తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకొని దళితులకు తీవ్ర అన్యాయం చేసిన జగన్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ఎన్నికల ముందు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జగన్‌రెడ్డి ఎత్తుగడను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నెపు భాస్కరరావు, బీవీ రమణమూర్తి, దవల అప్పలనాయుడు పాల్గొన్నారు.

విజయం తథ్యం


గార: ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

గార: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. గారలో శుక్రవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. బీసీలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని టీడీపీ అని చెప్పారు. తొలుత ఈ కార్యక్రమం శ్రీకూర్మంలో ప్రారంభించారు. పార్టీ నేతలు కైబాడి రాజు, గొర సురేష్, వైకుంఠ రావు, రాధాకృష్ణ రెడ్డి, జేసీ దేవదాస్ పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

టీడీపీలో వైసీపీ కార్యకర్తల చేరిక

కవిటి: నెలవంక పంచాయతీలోని దుర్గాంపుట్టుగ, కొరికానపుట్టుగ గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా దుక్క మన్మధరావు, నీలాపు దేవరాజు, దుక్క చిరంజీవి, దుక్క జోగారావు, రామారావు, ఏకాంబరు తదితరులను ఎమ్మెల్యే రామయ్యపుట్టుగలోని తన ఇంటివద్ద పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలరాజు, బి.రమేష్, ఎస్.వెంకటరమణ, బిసాయి హరికృష్ణ, హేమదాస్ తదితరులు పాల్గొన్నారు.

కంచిలిలో బాబు ష్యూరిటీ

కంచిలి: మఠం కంచిలి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బంగారు కురయ్య, కార్యదర్శి మాదిన రామారావు, భాస్కరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సంఘ సంస్కర్త వేమన

- ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్


నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

కలెక్టరేట్: సమాజంలో తన పద్యాల ద్వారా వెలుగులు నింపిన సామాజిక సంఘ సంస్కర్త వేమన అని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తన కవిత్వంతో సమాజాన్ని చైతన్యపరిచిన నవయుగ వైతాళికుడని కొనియాడారు. తెలుగుజాతి ఉన్నంతకాలం వేమన పద్యాలు ప్రజల నాలుకలపై నిలిచి ఉంటాయని, అత్యంత సులభమైన భాషలో, భావంతో ప్రజలకు సాహిత్యాన్ని చేరువ చేసిన ఘనత వేమనదని అన్నారు. అలాగే కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు శిక్షణ తీసుకుంటున్న 100 మంది మెరిట్ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, బీసీ సంక్షేమ అధికారిణి బి.అనూరాధ, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్లు ఎం.శ్రీకాంత్, ప్రకాష్, రామమూర్తి, బీసీ వెల్ఫేర్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

- **ఇచ్ఛాపురం రూరల్:** యోగి వేమన జయంతి సందర్భంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బోర పుష్ప ఆధ్వర్యంలో వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఏవో కె.రామారావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విశ్వ నాయకుడు.. అంబేడ్కర్


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వనాయకుడని, ఆయనను ఆదర్శంగా తీసుకుని నేటి తరం ముందుకు నడవాలని డీఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఏర్పాటు చేసిన మారథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పండుగ వాతావరణంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ విశ్వేశ్వరరెడ్డి, డీపీఆర్వో బాలమాన్‌సింగ్, సెట్‌శ్రీ సీఈవో బి.ప్రసాదరావు, డీఎస్డీవో శ్రీధర్, చింతాడ రామ్మోహన్, పలు క్రీడా సంఘాలు, దళిత సంఘాలు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో పిచ్చిమొక్కల తొలగింపు


జేసీబీలతో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దశ్యం

బూర్జ: పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారిలోని ఇరువైపులా ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ శుక్రవారం నిర్వహించారు. జేసీబీతో పిచ్చి మొక్కలను మలుపుల వద్ద తొలగించారు. ఇటీవల కాలంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కార్య క్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలగ కులస్థులను బీసీలో చేర్చాలి


ఇచ్ఛాపురం: డీటీకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

జి.సిగడాం: తెలగ కులస్థులను బీసీలో చేర్చాలని తెలగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావుకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో తెలగ కులానికి బీసీ రిజర్వేషన్లు ఉన్నాయని, మాకు 1962లో తెలగ కులస్థులకు రిజర్వేషన్లు ఉండేవని ఆ తర్వాత తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలగకుల సంఘ నాయకులు కాయల రమణ, సీహెచ్‌ఆర్‌కే రంగారావు, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, పిల్లల శివకుమార్, బి.సన్యాసిరావు, మానం సత్యారావు, వి.కోటిబాబు, పిడుగు శేఖర్, బత్తుల నాని, తదితరులు పాల్గొన్నారు.

- **ఇచ్ఛాపురం:** తెలగ కులస్థులను బీసీల్లో చేర్చాలని కోరుతూ తెలగ కుల సంఘం ప్రతినిధులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీహరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు బస్టాండ్ జంక్షన్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ వరకు చేపట్టారు. తెలగ కులసంఘ ప్రతినిధులు 9వ వార్డు కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి, కట్టా సూర్యప్రకాష్, పల్లంటి చిరంజీవి, మీనాకుమార్, జి.చరణ్, పి.అరుణ్, ఎం.శ్రీను, పి.బుజ్జి, రమేష్, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి


డ్రస్ కోడ్ పరిశీలిస్తున్న ఏఎస్పీ తిప్పేస్వామి

ఎచ్చెర్ల: పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఏఎస్పీ జె.తిప్పేస్వామి అన్నారు. ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సాయుధ సిబ్బంది డ్రస్ కోడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. ప్రతి రోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, ప్రసాదరావు, వాసుదేవ్, చొప్పరాజు, ఆర్ఐ డి.సురేష్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


దర్శనానికి బారుతీరిన భక్తులు

జి.సిగడాం: మదుపాంలోని దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారంతో ఈ యాత్ర మహోత్సవాలు ముగిశాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న యాత్రలో అధిక సంఖ్యలో మహిళలు మేళతాళాలతో ముర్రాటలు చెల్లించుకున్నారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


తులసీదాసు (ఫైల్)

జలుమూరు: లింగాలవలస వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వాన తులసీదాస్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. తులసీదాస్ గురువారం రాత్రి భోజనం చేసి బహిర్భూమికి వెళ్తుండగా నరసన్నపేట నుంచి పర్లాకిమిడి వెలుతున్న ఒడిశా బస్సు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తులసీదాస్‌కు తల్లిదండ్రులు సుమతి, మల్లేసు, ఇద్దరు వివాహితులైన అక్కచెల్లెళ్లు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలురు, బాలికల జట్లకు శుక్రవారం క్రీడా కిట్లను అందజేశారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నంద్యాలలో జరగనున్న జూనియర్ కబడ్డీ పోటీలకు గాను శుక్రవారం బయలు దేరుతున్న సందర్భంగా ఈ ఇరు జట్లకు డ్రస్సులను చింతాడ రవికుమార్ అందజేసి, విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, జిల్లా ఒలింపిక్ సంఘం సలహాదారుడు పి.సుందరరావు, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, మెట్ట తిరుపతిరావు, సాధు ముసలినాయుడు, కోటేశ్వరరావు, సీహెచ్ పాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయికి పూజలు

జి.సిగడాం: ఆనందపురంలో వెలసియున్న షిర్డీసాయి వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. 46 అడుగుల నాగసాయి విగ్రహం, 100 అడుగుల వెంకటసాయి మహాస్తూపం, షిర్డీసాయి బాబా వార్షికోత్సంలో సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ సామంతుల రామారావు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

కులగణనకు సహకరించండి

శ్రీకాకుళం క్రైం: కులగణాలకు ప్రజలు సహకరించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి చేతుల మీదుగా కులగణన కార్యక్రమం ప్రారంభించారు. పది రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా కుటుంబ వివరాలు పక్కాగా సేకరించాలని సూచించారు. కులగణన సకాలంలో పూర్తి చేసేలా సిబ్బందికి ప్రజలు సహకరించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు.

- **ఆమదాలవలస:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో చేపడుతున్న కులగణన సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వీఎస్ఎస్ లక్ష్మీ ప్రసన్న సూచించారు. శుక్రవారం స్థానికంగా జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా ప్రశ్నావళిని కుటుంబ సభ్యునికి చదివి వినిపించిన తర్వాతనే సమాచారం పూరించాలన్నారు. పరిశీలనలో కమిషనర్ ఎం.రవిసుధాకర్, జిల్లా ఉపగణాంకాధికారి టి.అప్పారావు, స్థానిక సహాయ గణాంకాధికారి బి.గోవిందరావు తదితరులు ఉన్నారు.

షర్మిల చేరికతో కాంగ్రెస్ బలోపేతం

ఆమదాలవలస: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ఈ నెల 21న ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఆమె చేరికతో పార్టీ బలోపేతమైందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు షర్మిల నాయకత్వంలో పనిచేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయమన్నారు.

తాగునీటికి పెద్దపీట

కంచిలి: ప్రభుత్వం తాగునీటికి పెద్దపీట వేస్తుందని ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి అన్నారు. శుక్రవారం కంచిలిలో ఎంపీపీ 15వ ఆర్థిక సంఘం నిధులతో కంచిలి 1, 2 సచివాలయ పరిధిలోని ఆసుపత్రి ప్రాంగణంలో, చర్చివీధిలో బోర్లు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. వజ్జ మృత్యుంజరావు, లడ్డు కేశవ పాత్రో, కె.సురేష్, కె.శేఖర్, ఎస్.చిరంజీవి, ఆర్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రగా శ్రీరాముని అక్షింతలు


అంక్షితలతో ఊరేగింపుగా..

కంచిలి: అయోధ్య రాముని అక్షింతలు బూరగాం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో శుక్రవారం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో గ్రామంలో ఇంటింటికి అక్షింతలు, శ్రీరాముని ఫొటో, జెండాలను అందించారు. సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు మహిళలు, యువకులు పాల్గొన్నారు.

స్టేషన్ మాస్టర్‌కు సన్మానం

శ్రీకాకుళం క్రైం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో 2023 ఏడాదికి గాను శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ బెస్ట్ క్లీన్ స్టేషన్‌గా ఎంపికైన నేపథ్యంలో స్టేషన్ మాస్టర్ మొదలవలస రవికుమార్‌ను ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో ఏఎస్పీని క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం సోమవారం నిర్వహించనున్న శ్రీరామ క్రతువులో పాల్గొనాలని ఏఎస్పీని క్లబ్ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, మెంటర్ నటుకుల మోహన్, జోన్ ఛైర్‌పర్సన్ బాడాన దేవభూషణ్‌రావు, వైస్ ప్రెసిడెంట్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.


సరుబుజ్జలి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


ఎచ్చెర్ల: అంబేడ్కర్ విగ్రహం ముందు ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు


నరసన్నపేట: పీవో కార్యాలయం వద్ద ధర్నా..

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు చేపట్టిన నిరసన శుక్రవారం కూడా కొనసాగింది. గత 39 రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై వారంతా మండిపడుతున్నారు. కొన్నిచోట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ చోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందించి నిరసన తెలిపారు.

- ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలి రూరల్: టెక్కలిలో అంగన్‌వాడీల నిరసన


ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


జలుమూరు: సారవకోట తహసీలార్ కార్యాలయం ఎదుట..


కోటబొమ్మాళి: ప్రాజెక్టు కార్యాలయం వద్ద..


పలాసరూరల్: కాశీబుగ్గ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట..